క్లుప్తంగా

'ఎస్‌బీఐ'లో రక్తదానం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి అర్బన్ : నగరంలోని ఎస్‌బీఐ పరిపాలన కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రాణదానమని తెలిపారు. జూలై 21వ తేదీన వార్షిక బ్యాంక్ డేను పురస్కరించుకుని ముందస్తుగా రక్తదాన శిబిరం చేపట్టినట్లు వెల్లడించారు. రక్తదాతలను అభినందించారు.

కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు



ఆర్‌డీఓకు సమస్య వివరిస్తున్న ఎంపీపీ

తిరుపతి రూరల్ : మండలంలోని సి.మల్లవరం జంక్షన్ నుంచి గాజులమండ్యం వరకు సాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో స్వర్ణముఖి నది నుంచి పేరూరు చెరువుకు వచ్చే వరద కాలువను పూడ్చివేయడంపై ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆర్‌డీఓ రామ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. కాలువ పూడ్చివేసి వంతెన నిర్మిస్తున్నారని, దీంతో పేరూరు చెరువుకు భవిష్యత్‌లో చుక్కనీరు కూడా వచ్చే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్‌డీఓ మాట్లాడుతూ సమస్యను జేసీ దృష్టికి తీసుకెళ్లి జలవనరులకు ఇబ్బందిలేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులుంటేనే ఉపాధ్యాయులు

పాకాల : పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మేరకే ఉపాధ్యాయులుంటారని ఎంఈఓలు బాబ్జీ, లింగయ్య తెలిపారు. శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలోని 12 మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఆర్పీలు శ్రీనివాసులు, ముని కృష్ణ, ప్రకాష్ రెడ్డి, శివకుమారి పాల్గొన్నారు.

అక్రమ కేసులను కోర్టులు సహించవు



చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది

తిరుపతి లీగల్ : అక్రమ కేసులు నమోదు చేస్తే కోర్టులు సహించవని న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి ఓ హెచ్చరిక లాంటిదన్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.20.50 లక్షల విరాళం



అదనపు ఈఓకు డీడీలు అందిస్తున్న దాతలు

తిరుమల: టీటీడీకి శుక్రవారం దాతలు రూ.20.50 లక్షల విరాళం అందజేశారు. విజయవాడలోని ఫార్చ్యూన్ ఫైన్ జ్యు వెలర్స్‌కు చెందిన కోమటి సునీల్ వేంకటేశ్వర్ రూ.10,50,001లు, తాడేపల్లిగూడేనికి చెందిన మాతురు పంచాక్షరి రూ.10, 00,116లను విరాళంగా అందించారు.

ఆక్రమణల తొలగింపు

తిరుపతి మంగళం : నగరంలోని కొత్తపల్లి శ్మశాన వాటికలో ఆక్రమణదారులు రాత్రికి రాత్రే నిర్మించిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. కొంక చెన్నాయగుంటలో సుమారు 200 అంకణాలకు పైగా కబ్జా చేసి ఆరు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అంకణం విలువ సుమారు రూ.3లక్షలు ఉందని అధికారులు వెల్లడించారు.

ఘనంగా 'మేడా' జన్మదినోత్సవం



రఘునాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కుటుంబసభ్యులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని నివాసంలో సోదరులు మేడా మల్లికార్జున రెడ్డి, మేడా మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డిని పలువురు నేతలు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేడా వెంకట్రామిరెడ్డి, మేడా రోహిత్, సాయి, నేతలు యోగీశ్వరరెడ్డి, వీర నారాయణరెడ్డి, మల్లం రవి, రామకృష్ణ, కాకి చంద్రమోహన్, అఖిల్, మధు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందన



కలెక్టర్‌తో సహకారశాఖ అధికారి నాగవర్ధన నారవర్థన, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ, స్పోర్ట్స్ అథారిటీ అధికారి శశిధర్

ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో పలు విభాగాలకు చెందిన అధికారులు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శుక్రవారం జిల్లా సహకారశాఖ అధికారి నాగవర్ధన, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శశిధర్ తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించారు. ఆయన వారికి అభినందనలు తెలిపారు. – తిరుపతి అర్బన్

కావమ్మ వైభవం



బొమ్మగుంట సమీపంలోని కావమ్మ, మారయ్య ఆలయంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు తిరునాళ్ల నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిపించారు. ధర్మకర్త కట్టా జయరామ్ యాదవ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు తిరునాళ్ల జరిపించనున్నట్లు వెల్లడించారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. – తిరుపతి కల్చరల్

కొండ మట్టి.. కొల్లగొట్టి!

పచ్చని పల్లెలపై అక్రమార్కులు పగబట్టారు. మూడు పూటలా మట్టి తింటూ రెచ్చిపోతున్నారు. కొండలు.. గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కళ్లెదుటే ప్రకృతి వనరులు ధ్వంసమవుతుంటే స్థానికులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో మండిపడుతున్నారు. కూటమి నేతల అండతో చెలరేగిపోతున్న మట్టి మాఫియాకు చెక్ పెట్టాలని పోరాటానికి సన్నద్ధమవుతున్నారు.

- రాజానగర్‌లో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- పోరాటానికి సిద్ధమవుతున్న స్థానికులు



రాజానగర్ వద్ద గుట్టను అక్రమంగా తవ్వుతున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రామచంద్రాపురం మండలం రాయలచెరువు పంచాయతీ పరిధిలోని రాజానగర్ పరిసరాల్లో కొండలు, గుట్టలను అక్రమార్కులు విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. దీనిపై పల్లెవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో సాగుతున్న మట్టి వ్యాపారం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అధికారుల జేబులను సైతం నింపుతోంది.ఈ క్రమంలో అక్రమార్కుల భరతం పట్టేందుకు సమీప గ్రామాల ప్రజలు సిద్ధమవుతున్నట్టు సమాచారం. వంత పాడుతున్న అధికారులను ఎక్కడికక్కడ నిలదీయడానికి పర్యావరణ పరిరక్షకులు సైతం సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

పరుగులు తీస్తున్న టిప్పర్లు

గత పది రోజులుగా రాజానగర్ పరిసరాల్లోని కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములు, అటవీ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వందల కొద్దీ టిప్పర్లను తిప్పుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను ఛిద్రం చేసేస్తున్నారు. పల్లెల్లో కూడా వేగం తగ్గించకుండా మట్టి టిప్పర్లు చక్కర్లు కొడుతుండటంతో పిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి కనుసన్నల్లో మట్టిమాఫియా రెచ్చిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులకు కళ్లెం వేయకుంటే రోడ్ల మీదకు వస్తామని హెచ్చరిస్తున్నారు.

15న చిరువ్యాపారులతో దీక్ష

తిరుపతి కల్చరల్ : జీవనోపాధినిక కల్పించి, సమస్యలు పరిష్కరించాలని 298 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ఎదుట శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు నిరసన తెలుపుతున్నా టీటీడీ యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీవారి మెట్టు వద్ద భక్తులను నమ్ముకుని సుమారు 30 కుటుంబాలు జీవనం సాగించేవన్నారు. టీటీడీ యాజమాన్యం తక్షణమే స్పందించి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే చిరు వ్యాపారులతో కలిసి ఈనెల 15న నిరాహారదీక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు. నేతలు డి,.చిట్టిబాబు, ఎస్.లోకనాథం, యుగంధర్, పెంచలయ్య, మల్లికార్జున, రాంబాబు, గణేష్, గోపి, ప్రదీప్, చిరంజీవి పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్: కొర్లగుంట అబ్బన్న కాలనీకి చెందిన మున్నాకుమార్ అలియాస్ మున్నా అనే వ్యక్తి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... అబ్బన్న కాలనీలోని ఇంటి వద్ద మున్నా ఉండగా హరినాయక్ అనే వ్యక్తి అక్కడకు వచ్చి గొడవకు దిగాడు. రాయితో మున్నా తలపై కొట్టి పరారయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మున్నా మరణించాడు. పోలీసులు ఈ మేరకు హత్య కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి మాడవీధుల్లో ఉదయం 4.45 నగర సంకీర్తన.
- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు తిరువీధి ఉత్సవం.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కార ప్రధాన సభ.
- యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు వేణుగోపాల్ కాలనీలో ఇళ్ల కూల్చివేతపై ప్రచార కరపత్రాల ఆవిష్కరణ.
- కుమార్ మంగళం బిర్లా జన్మదిన వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం 12.30 గంటలకు గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం.
- మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 6 గంటలకు ఎస్పీ బాలు పాటల సంగీత విభావరి ప్రారంభం.
- తిరుచానూరు పద్మావతి అమ్మవారికి గజవాహన సేవ.
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవత సప్తాహం.
- అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ.

వ్యక్తిపై దాడి

తిరుపతి క్రైం : అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవకోన వద్ద ఒక వ్యక్తిపై దాడి జరిగిన టన శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు.. జీవకోన క్రాంతి నగర్ లో నివాసం ఉంటున్న మణి(30) ఫుల్లుగా మద్యం సేవించి సమీపంలోని ఆలయం వద్ద పడుకున్నాడు. శివ ప్రసాద్ రెడ్డి, దిలీప్ కుమార్, విజయ్ కుమార్ అనే వ్యక్తులు పాత కక్షలతో మణిపై దాడి చేశారు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

వెటర్నరీ వైద్యులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందిస్తున్న వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ

తిరుపతి తుడా : యానిమల్ కేర్ ల్యాండ్, వరల్డ్ వైడ్ వెటర్నరీ సర్వీసెస్ ఆధ్వర్యంలో శునకాల జనన నియంత్రణ శస్త్ర చికిత్సలపై తూకివాకంలో రెండు వారాలుగా వెటర్నరీ వైద్యులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పొందిన పశు వైద్యులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు శునకాల జనన నియంత్రణపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకుని పురపాలక శాఖకు సహకరించాలని సూచించారు. శిక్షకులు డాక్టర్ యుగంధర్ నాయుడు, డాక్టర్ నవీన్, యానిమల్ కేర్ ల్యాండ్ పశువైద్యులు యజ్ఞ, మున్సిపల్ వెటర్నరీ అధికారి డాక్టర్ నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

తిరుపతి కల్చరల్ : యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో అతి తక్కువ ఫీజుతో ఏసీ ల్యాబ్‌లో వివిధ కంప్యూటర్ కోర్సులకు సంబంధించి గురువారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మల్లారపు నాగార్జున తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంఎస్ ఆఫీస్ బేసిక్ కంప్యూటర్స్, డీసీఏ, పీజీడీసీఏ, ట్యాలీ, సీ,సీ ప్లస్ ,పైథాన్, జావా, ఏ1(ఆన్‌లైన్), పవర్ బీ1, ఆటో కాడ్, డీటీపీ తదితర కోర్సులలో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9985786146,8985080370 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పౌరాణిక శిరోమణికి సత్కారం



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : అన్నమాచార్య కళామందిరంలో నిర్విరామంగా 12 గంటల పాటు ఉపనిషత్తుల సారం వినిపించిన పౌరాణిక శిరోమణి పొన్న కృష్ణమూర్తిని శుక్రవారం రాయలసీమ రంగస్థలి కళాకారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, సుబ్రమణ్యం యాదవ్, రవిప్రసాద్, నాగేశ్వరరావు, తిరుమలయ్య, అన్నమాచార్య కళామందిరం కో–ఆర్డినేటర్ కోకిల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రాణ రక్షణే వైద్యుల లక్ష్యం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

తిరుపతి తుడా : ప్రాణ రక్షణే వైద్యుల లక్ష్యమని, ప్రజలకు చేరువలో ఉండే చిన్న ఆస్పత్రులను అడ్డుకోవడం సరికాదని ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలోని ఓ 20 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను ఆపాలని వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం వారు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్స్, ఆపార్ట్‌మెంట్‌లకు లేని అభ్యంతరం ఆస్పత్రులకు ఏంటని ప్రశ్నించారు.డాక్టర్ జనార్దన్, డాక్టర్ రవిరాజు, డాక్టర్ మారుతీకృష్ణ, డాక్టర్ దామోదర్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర కన్వీనర్‌గా సురేంద్రబాబు



తిరుపతి ఎడ్యుకేషన్ : అనంతపురంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏబీవీపీ సదస్సులో తాను తిరుపతి విభాగ్ కన్వీనర్‌గా ఎన్నికైనట్లు వై.సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. క్షేత్ర స్థాయిలో విద్యారంగం, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అధ్వాన్నం.. అభివృద్ధి శూన్యం



డ్రైనేజీని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరంలో అభివృద్ధి పడకేసిందని, రోడ్లు, డ్రైనేజీలు అధ్వాన్నంగా తయారయ్యాయని తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీలో గుంతమయంగా మారిన రహదారులు, మురుగునీటి కాలువలను వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రోడ్లు దారుణంగా మారాయని, డ్రైనేజీలను నెలల తరబడి శుభ్రం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాసుయాదవ్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు, కూటమి నేతలు ఇప్పటికైనా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ, నిర్మాణంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నేతలు తలారి రాజేంద్ర, రమణ, ప్రసాద్, కిరణ్, శివ, చంద్రమౌళి, రాజేష్, అంజి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

తిరుపతి క్రైమ్: రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... రాఘవేందర్ నగర్ లో నివాసం ఉంటున్న వెంకటరమణ బాబు విదేశాల నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూసుకోగా గత ఏడాది ఆగస్టు 18వ తేదీన చోరీ జరిగినట్టుగా సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా నిర్ధారించుకున్నారు. ఇంట్లో ఉన్న 50 గ్రాములు బంగారు 500 గ్రాములు వెండి అపహరణకు గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 69,609 మంది స్వామిని దర్శించుకున్నారు. 33,144 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.11 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 16 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పనిచేస్తే.. బదిలీ చేస్తారా?

- రాజకీయాల కోసం పంచాయతీ కార్యదర్శిపై వేటు వేస్తారా?
- 13 నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్న వ్యక్తిపై కక్ష ఎందుకు?
- తుమ్మలగుంట వాసుల ఆందోళన



తుమ్మలగుంట సచివాలయం ఎదుట ఆందోళనకు దిగిన గ్రామస్తులు, కార్మికులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శి బదిలీ వ్యవహారం రోడ్డెక్కింది. నిబంధనలకు విరుద్ధంగా వచ్చిన 7 నెలలకే ఆయనపై బదిలీ వేటు వేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయం ముందు ఆందోళనకు దిగారు. కార్యదర్శిగా వెంకటేశ్వర్లు వచ్చినప్పటి నుంచి తమ గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగపడిందని, అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని వెల్లడించారు. ఊరు నిద్ర లేచే సమయానికి ఆయన గ్రామంలో తిరుగుతూ పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయిస్తుంటారని చెప్పారు. రాత్రి, పగలు కష్టపడే వ్యక్తిని రాజకీయ కారణాలతో బదిలీ చేయడం మంచిది కాదని స్పష్టం చేశారు. 13 నెలల్లో ఉద్యోగ విరమణ చెందుతున్న పంచాయతీ కార్యదర్శిపై అంత కక్ష ఎందుకు కట్టారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పంచాయతీ కార్మికులు సైతం మండిపడ్డారు. వెంటనే బదిలీ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బాధగా ఉంది



పంచాయతీలో నేను పదేళ్లుగా పనిచేస్తున్నా. ఇలాంటి అధికారిని ఇప్పటి వరకు చూడలేదు. ఆయన బదిలీ అవుతున్నారంటే చాలా బాధగా వుంది.
– ప్రమీల, పంచాయతీ కార్మికురాలు

మంచి కోరే వ్యక్తి



ప్రజలందరి మంచి కోరుకునే వ్యక్తి కార్యదర్శి వెంకటేశ్వర్లు. పారిశుద్ధ్య కార్మికులైన మమ్మల్ని కూడా ఎంతో గౌరవంగా చూసుకుంటారు. ఆయన వస్తేనే పనిచేస్తాం.
– వెంకటమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు

చక్కగా సేవలు అందించారు



తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు ప్రజలకు చక్క గా సేవలు అందించా రు. ఇప్పటి వరకు ఒక్క చిన్న ఫిర్యాదు కూడా ఆయనపై రాలేదు.
– సుబ్బరామిరెడ్డి, సర్పంచ్, తుమ్మలగుంట

కక్షతోనే చేశారు



వెంకటేశ్వర్లు మా గ్రామానికి కార్యదర్శిగా వచ్చి 7 నెలలు మాత్రమే గడిచింది. రాజకీయ కక్షతోనే ఆయనను బదిలీ చేశారు. ఇందులో సందేహం లేదు.
– గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్, తుమ్మలగుంట

భావ్యం కాదు



పంచాయతీలో బాగా పనిచేసినా సరే బదిలీ చేస్తారా..? ఏ తప్పు చేయకున్నా సరే పాలిటిక్స్ కోసం ఉద్యోగులను బాధపెట్టడం భావ్యం కాదు.
– సి.రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్, తుమ్మలగుంట

బాగా కలసిపోయారు



పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు అందరితో చాలా బాగా కలసిపోయారు. ఆయనను బదిలీ చేయడం మాత్రం దుర్మార్గం. అధికారులు పునరాలోచించాలి.
– జయచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్, తుమ్మలగుంట

అందరినీ గౌరవిస్తారు



సచివాలయానికి వచ్చే అందరినీ వెంకటేశ్వర్లు బాగా గౌరవిస్తారు. ఇంతకాలానికి పనిచేసే కార్యదర్శి వచ్చారని చాలా సంతోషపడ్డా. ఇంతలోనే బదిలీ చేస్తారనుకోలేదు. – యచ్చం బుజ్జమ్మ, ఎంపీటీసీ సభ్యులు

మంచి చేస్తే నచ్చదా?



తుమ్మలగుంటలో ప్రజలందరికీ మంచి చేసే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు. అందరికీ మంచి చేస్తే మీకు నచ్చదా? అందుకే బదిలీ చేస్తున్నారా..? – ఎం.రత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యులు

గ్రామానికి చెడు చేయడమే



మా గ్రామానికి మంచి చేసే కార్యదర్శిని బదిలీ చేశారు. చాలా మర్యాదగా మాట్లాడుతుంటారు. మంచి మనిషికి బదిలీ చేయడం మా గ్రామానికి చెడు చేయడమే అవుతుంది. – గీతమ్మ, తుమ్మలగుంట

విధులు బహిష్కరిస్తాం



పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు వచ్చినప్పటి నుంచి కార్మికులు చక్కగా పనిచేస్తున్నారు. బదిలీ ఆపేంత వరకు విధులు బహిష్కరిస్తాం. – అరుణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సైబర్ మోసంపై ఫిర్యాదు

తిరుపతి క్రైమ్: సైబర్ నేరగాళ్లు విశ్రాంత సెంట్రల్ ఉద్యోగిని బురిడీ కొట్టించారు.. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. రాఘవేంద్ర నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వెంకట బాబుకు శుక్రవారం గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను సీబీఐ అధికారిని అంటూ ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నారు. మీ ఆధార్ కార్డులో ఢిల్లీ కెనరా బ్యాంకులో అకౌంట్ ఉందని, అది మానవ అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి వినియోగిస్తున్నారని తెలిపాడు. తర్వాత వీడియో కాల్ చేశాడు. వెంటనే బ్యాంకు ఖాతాల సమాచారం ఇవ్వాలని, లేకుంటే ఈడీ, రా, ఎన్ఐఏకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని బెదిరించాడు. దీంతో భయపడిన వెంకటబాబు వెంటనే తన ఖాతాల వివరాలు తెలియజేశాడు. దీంతో ఆయన ఖాతా నుంచి రూ.32లక్షలను సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు.ఈ మేరకు జరిగిన మోసం గ్రహించిన వెంకటబాబు వెంటనే ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

46 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 46 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.